కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నగరం అభివృద్ధి



సనత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ



జూబ్లీహిల్స్ శ్రీరాంనగర్ రోడ్‌షోలో నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ చెయ్యెత్తి చూపిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

- బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగింది
- సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ

బేగంపేట, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే హైదరాబాద్‌లో అభివృద్ధి జరిగిందని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. మంగళవారం సనత్‌నగర్ డివిజన్‌లోని బీకే గూడ పార్క్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై ఆమె మండిపడ్డారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపిస్తే రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే తలసాని ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్రంగా స్పందించారు. తొందరపడి తలసాని రాజీనామా చేయవద్దని ఆమె ఎద్దేవా చేశారు. గొర్రెల స్కామ్‌తో తలసాని బీసీల పొట్ట కొట్టారని విమర్శించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎక్కడా బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించే అవకాశాలు లేవని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లల్లోనే ప్రపంచ స్థాయి కంపెనీలను నగరానికి తీసుకురావడం జరిగిందన్నారు.

కాంగ్రెస్‌లోకి వడ్డెర సంఘం జాతీయ నాయకులు



సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న అఖిలభారత వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు నారాయణస్వామి, తదితరులు

ఎర్రగడ్డ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అఖిలభారత వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు ఎం.నారాయణస్వామి, తెలంగాణ వడ్డెర సంఘం కాంట్రాక్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేరంగుల రామచంద్రరావు తదితరులు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నారాయణస్వామి అప్పట్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ కూడా చేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావులు కాంగ్రెస్ పార్టీలో చేరడం కోసం తనను కలిశారన్నారు. దాంతో ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీలో చేరినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో తెలంగాణ వడ్డెర సంఘం కాంట్రాక్ట్ అసోసియేషన్ యూత్ ప్రధాన కార్యదర్శి గొలుసుల కృష్ణ తదితరులు ఉన్నారు.

నవీన్ యాదవ్‌కు వడ్డెర సంఘం మద్దతు

బోరబండ, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పించిందని, అందుకే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు తెలుపుతున్నట్లు వడ్డెర్ల ఆత్మీయ సమ్మేళనం తీర్మానించింది. ఇందిరానగర్‌లో వడ్డెర సంఘం తెలంగాణ (గన్ను దెబ్బ) ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎంబీసీ చైర్మన్ జెరిపెటి జైపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న వడ్డెర వీరుడు వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య మాట్లాడుతూ సీఎల్పీ మాజీనేత పీజేఆర్ కృషివల్ల జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల్లో వడ్డెరలు స్థిరపడ్డారని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపెటి సత్యనారాయణ రాజు, వడ్డెర సంఘం గన్ను దెబ్బ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు డా. ఓర్స్ కృష్ణయ్య, సంఘం జంట నగరాల అధ్యక్షుడు ఎం.పెంటేష్, ఓర్స్ అడివయ్య, కుంచాల రమ, వల్లెపు లక్ష్మీ, ఎ.బాలకృష్ణ, వేముల సత్యం, నారాయణ, ఎ.మోహన్, అనంత రావు, ఆనంద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంబీసీ చైర్మన్ జైపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న వడ్డెర సంఘం ప్రతినిధులు



జూబ్లీహిల్స్‌లో శివకుమార్‌కు మద్దతుగా ప్రచారంలో నాగసాధువులు

జూబ్లీహిల్స్ ప్రచారంలో నాగసాధువులు

ఖైరతాబాద్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో నాగసాధువులు కనిపించారు. యుగ తులసి పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్న కొలిశెట్టి శివకుమార్ గోవును జాతీయ మాతగా ప్రకటించాలని, గోహత్యలను నిషేధిస్తూ జంతు వధశాలలను మూసివేయాలనే డిమాండ్‌తో ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున ఆయనకు మద్దతుగా రెండు రోజుల పాటు ప్రచారం చేశారు. కాశీ లోని జూనా అఖాడా, బడా హనుమాన్ ఘాట్‌లకు చెందిన నాగసాధువులు నియోజకవర్గంలోని బోరబండ, యూసుఫ్‌గుడ,షేక్‌పేట, ఓయూ కాలనీ, రాజీవ్‌నగర్, రహ్మత్‌నగర్‌లలో ప్రచారం నిర్వహించి ధర్మం కోసం పాటు పడుతున్న శివకుమార్‌కు మద్దతుగా నిలవాలని ప్రచారం చేశారు.



ప్రజాభవన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

సీఎం ప్రజావాణికి 238 దరఖాస్తులు

బేగంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 238 దరఖాస్తులు వచ్చాయి. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటూ వారి సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు 51, రెవెన్యూకు 46, మున్సిపల్‌కు 23, ఇందిరమ్మ ఇండ్ల కోసం 67, ప్రవాసీ ప్రజావాణికి 2, ఇతర శాఖలకు చెందిన 49 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు.



మృతిచెందిన అత్తాకోడళ్ల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్. చిత్రంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, వెంకటస్వామి

'చేవెళ్ల' మృతుల కుటుంబాలకు పొన్నం పరామర్శ

బోరబండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అత్తా కోడళ్ల కుటుంబ సభ్యులను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. రహ్మత్ నగర్ డివిజన్ కార్మికనగర్ కు చెందిన అత్తాకోడళ్లు గంగుల గున్నమ్మ (65), గంగుల కల్పన (45) చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం కార్మికనగర్‌లోని నివాసంలో బాధిత కుటుంబ సభ్యులు గున్నమ్మ భర్త నరసింహా రెడ్డి, కల్పన భర్త రాజిరెడ్డిని ఓదార్చారు. మృతులు ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున రూ.9లక్షలు అందుతాయని తెలిపారు. మృతురాలు కల్పన కొడుకు సాయిరెడ్డికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేయగా, ఎన్నికల తర్వాత విషయం పరిశీలిస్తానని చెప్పారు. మంత్రి వెంట రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎన్ఎస్‌యూఐ. రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి ఉన్నారు.



సికింద్రాబాద్ కోర్టు న్యాయవాదులతో టీపీసీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్

కోర్టును సందర్శించిన పొన్నం అశోక్‌గౌడ్

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సివిల్ కోర్టును సందర్శించిన టీపీసీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్‌కు మంగళవారం టీపీసీసీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి గుంజి సంతోష్ కుమార్ వడ్డే రాజ్ స్వాగతం పలికారు. అనంతరం అశోక్‌గౌడ్ విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదులను కలిసి వారి సమస్యల అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీని విస్మరించారు..



కృష్ణకాంత్ పార్క్ వద్ద దివ్యాంగుల నిరసన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ దేదీప్య విజయ్

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వెంగళరావునగర్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీని నిలబెట్టుకోకుండా వారిని మోసం చేసిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం యూసుఫ్ గూడ కృష్ణకాంత్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల నిరసన ర్యాలీని ఆయన స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ తో కలిసి ప్రారంభించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. కేసీఆర్ హయాం లో నెలకు రూ.500 ఉన్న పింఛన్‌ను దఫాలు గా నాలుగు వేల రూపాయలకు పెంచి అమ లు చేసిందన్నారు. గత ఎన్నికల్లో తాము గెలిస్తే పింఛన్ ఆరు వేల రూపాయలకు పెంచి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి పెంచలేదని అన్నారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో మరో సారి వారిని మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజకీయంగా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని చెబుతున్నప్పటికీ ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సునీత గోపీనాథ్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా దివ్యాంగులు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వండి ప్లీజ్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.



ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం సేవా సమాఖ్య ప్రతినిధులు

ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానం

చిలకలగూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణసంఘం సేవాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్తీకమాసం వన సమారాధన, ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావాలని మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖరరెడ్డికి మంగళవారం సమాఖ్య ప్రతినిధులు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ రావు, జే.సుబ్రహ్మణ్యం, మంగళంపల్లి మురళి, పర్వతవర్ధిని, అన్నపూర్ణలు పాల్గొన్నారు.

అక్రమంగా భవన నిర్మాణం..

స్థానికుల ఫిర్యాదు

బౌద్ధనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడలో నిబంధనలకు విరుద్ధంగా కడుతున్న ఓ అక్రమ భవన నిర్మాణంపై బస్తీవాసులు మంగళవారం జోనల్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బస్తీవాసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలగూడ వెస్లీ చర్చి మార్గంలో ఓ వ్యక్తి రెండు అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేశాడు. సదరు యాజమాని రహదారిని ఆక్రమించి సెట్ బ్యాకులు లేకుండా నిర్మాణం కొనసాగిస్తున్నాడని, దీంతో అత్యవసర సర్వీసులైన అంబులెన్స్, ఫైర్ ఇంజన్, పోలీస్ పెట్రోలింగ్, సీవరేజీ క్లీనింగ్, వాటర్ ట్యాంకర్లు తదితర వాహనాలు బస్తీల్లోకి వచ్చే అవకాశం లేదని వీరాసింగ్‌నగర్‌కు చెందిన బస్తీవాసులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.



బీఆర్ఎస్‌లో చేరిన మైనారిటీ మహిళలతో దాస్యం వినయ్ భాస్కర్

'మా హయాంలో మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట'

బోరబండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేశారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. రహ్మత్ నగర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది ముస్లిం మహిళలు మంగళవారం బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా మహిళలకు గులాబీ కండువాలు అందజేసి పార్టీలోకి ఆహ్వానించిన దాస్యం మాట్లాడుతూ, మైనార్టీ సంక్షేమానికి రూ.వేల కోట్ల నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ మేయర్ రిజ్వానా మసూద్, మాజీ కార్పొరేటర్ షఫీ, ఎం.డి.లియాఖత్ అలీ, జావీద్, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

లక్షలాది మందితో మాల రణభేరి మహాసభ

పంజాగుట్ట, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎస్సీ వర్గీకరణ ద్వారా మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. మంగళవారం ఖైరతాబాద్ ప్రేమ్ నగర్ అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 23న చలో హైదరాబాద్ పేరుతో సరూర్ నగర్ స్టేడియంలో లక్షలాది మందితో నిర్వహించనున్న మాల రణభేరి మహాసభ కరపత్రాన్ని, పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు కె.భగవాన్ దాస్,ప్రేమ్ నగర్ బస్తీ అధ్యక్షుడు దాసరి విశ్వనాథం, బస్తీ చైర్మన్ మహే ష్ కుమార్, కోశాధికారి సుధీర్ కుమార్, సభ్యులు బాబురావు, ప్రవీణ్ కుమార్,హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ పట్ల అనుచిత ప్రవర్తన

ముగ్గురు యువకుల రిమాండ్

ఖైరతాబాద్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలులో సీనియర్ సిటిజన్‌కు కేటాయించిన సీటును ఆక్రమించడమే కాక అమర్యాదగా ప్రవర్తిస్తూ మెట్రో రైలు ట్రాక్ పైకి తోసేసిన ముగ్గురు యువకులను న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది. సైఫాబాద్ డివిజన్ ఏసీపీ ఆర్ సంజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. అక్టోబరు 21వ తేదీన సాయంత్రం బేగంపేటకు చెందిన న్యాయవాది కృష్ణ కిషోర్ అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో రైలు ఎక్కాడు. ఆయన ఎల్‌బీనగర్‌కు వెళ్లాల్సిఉండగా మెట్రో రైలులో సీనియర్ సిటిజన్లకు కేటాయించిన స్థానంలో కూర్చునేందుకు వెళ్లగా అప్పటికే దానిపై కూర్చున్న ఓ యువకుడు సీటు ఇచ్చేందుకు నిరాకరించాడు. ఈవిషయమై యువకుడితో పాటు ఇద్దరు స్నేహితులతో గొడవ జరగగా యువకులు కృష్ణ కిషోర్ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ అసభ్య పదజాలంతో దూషించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసిన పెద్దాయన లక్డీకాపూల్‌లో యువకులు దిగేందుకు ప్రయత్నించగా వారిని అడ్డుకొని 'మీపై ఫిర్యాదు చేశాను.. ఆగండంటూ వారితోపాటు రైలు దిగగా యువకులు అతడిని మెట్రో రైలు పట్టాలపైకి తోసేశారు. దీంతో గాయాలకు గురైన పెద్దాయన పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసుకొని గాలిస్తున్న పోలీసులు సోమవారం యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. నిజాంపేటకు చెందిన సివ్వల శివకుమార్ (32), సివ్వల రాజేష్ (34), కాలిషెట్టి అశోక్ (34)ను న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టగా సీనియర్ సిటిజన్‌ను రైలు పట్టాలపైకి తోసేసినందుకు గాను ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. కేసును ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్ఐ నవీన్ విచారించారని ఏసీపీ తెలిపారు. సీనియర్ సిటిజన్ల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



విద్యుత్ శాఖ ఎర్రగడ్డ విభాగం ఏఈ తబ్రీజ్ కు వినతి పత్రం అందజేస్తున్న జనసేన పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ సాహూ తదితరులు

విద్యుత్ స్తంభాలను మార్చండి : జనసేన

ఎర్రగడ్డ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరుతూ మంగళవారం ఎర్రగడ్డ విద్యుత్ శాఖ ఏఈ తబ్రీజ్ కు జనసేన పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ సాహూ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

24 గంటల్లోనే దోపిడీ ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీసీపీ, పోలీసు అధికారులు



నిందితుల అరెస్టును చూపుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లో వ్యక్తుల్ని బెదిరించి దోపిడికి పాల్పడుతున్న నలుగురు నిందితులను ఇరవై నాలుగు గంటల్లోనే బేగంపేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మంగళవారం నార్త్‌జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ రష్మీ పెరుమాళ్, బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ, సైదయ్యలు నేర ఘటన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మారేడుపల్లి పికెట్ ప్రాంతానికి చెందిన కల్యాణ్ 3న అర్ధరాత్రి 12 గంటలకు క్యాంటీన్ పనులు పూర్తి చేసుకుని తన స్నేహితుడు తరుణ్‌తో కలిసి ఇంటికి వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు నడుచుకుంటూ చేరుకున్నారు. దారి మధ్యలో వీరు తమ స్నేహితుడు గోపికి ఫోన్ చేసి బైకు తీసుకుని రావాలని చెప్పగా అతడు స్టేషన్ వద్దకు వచ్చాడు. ముగ్గురు కలిసి క్లాక్‌టవర్ వైపు వాహనంపై వెళుతుండగా వాహనంలో పెట్రోల్ అయిపోయింది. ఆ సమయంలో అక్కడికి ఆటోలో వచ్చిన కార్ఖానాకు చెందిన పన్నం రాజేష్(18), సిఖ్‌విలేజీకి చెందిన బోయ నర్సింహ (18), పరుశురాం(20)తో పాటు మరో వ్యక్తి కలిసి కత్తులు చూపించి వారిని డబ్బులు డిమాండ్ చేశారు. అనంతరం వారినుంచి రూ.8,500 నగదును బలవంతంగా తీసుకుని పారిపోయారు. అదేవిధంగా ఈ నిందితులు బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన గుల్బాం అన్సారీ బస్‌స్టాప్‌లో నిలబడి ఉండగా ఆటోలో వచ్చి కత్తితో బెదిరించి రూ.6 వేలు నగదు, ఫోన్ నుంచి రూ.1,500 డబ్బులు వేయించుకుని పారిపోయారు. ఈ విషయాన్ని అన్సారీ తన యజమానికి ఫోన్ చేసి విషయం తెలుపడంతో వెంటనే మార్టిన్ బేగంపేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్రమత్తమైన బేగంపేట్ పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి ఆటో నంబరు ఆధారంగా నిందితులను ఇరవై నాలుగు గంటల్లోనే పట్టుకుని, దర్యాప్తు చేయగా నేరం ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇరవై నాలుగు గంటల్లో నిందితులను పట్టుకున్న బేగంపేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సైదులు డీఐ శ్రీనివాస్‌తో పాటు క్రైమ్ కానిస్టేబుళ్లు సతీష్, మహేష్, అజ్జు, అశోక్, హరీస్‌లను డీసీపీ అభినందించింది.

పెన్షనర్లను మోసం చేసిన కాంగ్రెస్‌కి బుద్ధి చెప్పాలి

తెలంగాణ పెన్షనర్ల హక్కుల పరిరక్షణ కమిటీ



ఆచార్య జయశంకర్ పెన్షనర్ల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను విడుదల చేస్తున్న స్వామి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, దేవి ప్రసాద్, తదితరులు

బోరబండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉపఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆచార్య జయశంకర్ తెలంగాణ పెన్షనర్ల హక్కుల పరిరక్షణ కమిటీ కోరింది. పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, మాజీమంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్, టీఎన్జీవో మాజీ చైర్మన్ మామిళ్ల రాజేందర్ తదితరులు శ్రీరామ్ నగర్‌లో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు 18,672 మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారని, వీరికి హక్కుగా రావలసిన ప్రయోజనాలను ప్రభుత్వం చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉద్యోగులు దాచుకున్న డబ్బు కూడా ప్రభుత్వం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం చరిత్రలో ఇదే తొలిసారి అని దుయ్యబట్టారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కులను కాపాడుకునేందుకు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించాలని పిలుపునిచ్చారు. రహ్మత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ షఫి, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, వివిధ జేఏసీల ప్రతినిధులు విష్ణువర్ధన్ రావు, మహమ్మద్ సిరాజ్, మహమ్మద్ కుతుబుద్దీన్, ఎం.డి. జహురుద్దీన్, ఎం.ఎ.ముఖీద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజశేఖరరెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం సేవా సమాఖ్య ప్రతినిధులు

ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానం

చిలకలగూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణసంఘం సేవాస మాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్తీకమాసం వన సమారాధన, ఆత్మీయ సమ్మేళనానికి హాజరుకావాలని మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖరరెడ్డికి మంగళవారం సమాఖ్య ప్రతినిధులు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరావు, జే.సుబ్రహ్మణ్యం, మంగళంపల్లి మురళి, పర్వతవర్ధిని, అన్నపూర్ణలు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ కోర్టు న్యాయవాదులతో టీపీసీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్

కోర్టును సందర్శించిన టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సివిల్ కోర్టును సందర్శించిన టీపీసీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్‌కు మంగళవారం టీపీసీసీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి గుంజి సంతోష్ కుమార్ వడ్డేరాజ్ స్వాగతం పలికారు. అనంతరం అశోక్‌గౌడ్ విధి నిర్వహణలో ఉన్న న్యాయవాదులను మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యల అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన న్యాయవాదుల సమస్యల్ని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.



అడ్డగుట్ట ప్రభుత్వ స్కూలు ఎదురుగా తెరిచి ఉన్న మ్యాన్‌హోల్

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలి

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల గేటు ముందు నెల రోజుల నుంచి మ్యాన్‌హోల్ తెరిచి ఉండడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు భయానికి గురవుతున్నారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు తమ పిల్లల్ని స్వయంగా స్కూలు వద్ద దింపి వెళుతున్నారు. మ్యాన్‌హోల్ తెరిచి ఉందని మారేడుపల్లి జలమండలి ఏఈ స్రవంతి, సూపర్‌వైజర్ శ్రీకాంత్‌తో పాటు ఉన్నతాధికారులకు నెలరోజుల నుంచి స్థానికులు ఫిర్యాదు చేసినా ఇంత వరకు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయలో వస్తారా? అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు పాఠశాల విద్యార్థులు కోరుతున్నారు.

అక్రమంగా భవన నిర్మాణం.. స్థానికుల ఫిర్యాదు

బౌద్ధనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడలో నిబంధనలకు విరుద్ధంగా కడుతున్న ఓ అక్రమ భవన నిర్మాణంపై బస్తీవాసులు మంగళవారం జోనల్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బస్తీవాసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలగూడ వెస్లీ చర్చి మార్గంలో ఓ వ్యక్తి రెండు అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేశాడు. సదరు యాజమాని రహదారిని ఆక్రమించి సెట్ బ్యాకులు లేకుండా నిర్మాణం కొనసాగిస్తున్నాడని, దీంతో అత్యవసర సర్వీసులైన అంబులెన్స్, ఫైర్ ఇంజన్, పోలీస్ పెట్రోలింగ్, సీవరేజీ క్లీనింగ్, వాటర్ ట్యాంకర్లు తదితర వాహనాలు బస్తీల్లోకి వచ్చే అవకాశం లేదని వీరాసింగ్‌నగర్‌కు చెందిన బస్తీవాసులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



శివకుమార్

బౌద్ధనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలగూడ చింతబావికి చెందిన పి.శివకుమార్(35) లేబర్. అతడు కొన్నిరోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. అక్టోబరు 27న ఇంటి నుంచి బయటకు వెళ్లిన శివకుమార్ తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవటంతో సోమవారం రాత్రి తన అన్నయ్య కనిపించటం లేదని తమ్ముడు నర్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌బాల్ మైదానాన్ని అభివృద్ధి చేయండి

- ఎత్తు పల్లాలుగా గ్రౌండ్
- వర్షం వస్తే బురదమయం
- అధికారుల బాధ్యతారాహిత్యం



గ్రౌండ్‌లో మురుగు నీరు, పిచ్చి మొక్కలు

తిరుమలగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో సరిగా వసతులు లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే గ్రౌండ్‌లో వర్షపునీరు చేరి చెరువును తలపిస్తుంది. ఇక్కడ ప్రాక్టీస్ చేసిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన విషయం అందరికీ తెలిసిందే. అయితే గ్రౌండ్‌లో మాత్రం వసతులు కరువయ్యాయి. ఈ గ్రౌండ్ వర్షాకాలం నీరు, ఎండాకాలంలో దుమ్మూధూళితో కొట్టుమిట్టాడుతుంది. దీంతోపాటు గ్రౌండ్‌లో ఎత్తు పల్లాలు ఉండటంతో క్రీడాకారులు సరిగా ప్రాక్టీస్ చేయలేకపోతున్నారు. ఇక్కడ ప్రైమరీ స్కూల్ నుంచి డిగ్రీ కళాశాల విద్యార్థుల వరకు ప్రాక్టీస్ చేస్తుంటారు.

క్రీడాకారులకు పుట్టినిల్లు

తిరుమలగిరి, బొల్లారం ప్రాంతాల్లో బ్రిటీష్ మిలిటరీ అధికారులు సాయంత్రం పూట ఆటవిడుపులో భాగంగా ఇదే గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ ఆడుకునేవారు. మిలిటరీ అధికారుల ఫుట్‌బాల్ ఆట తీరును చేసే ఆ ప్రాంతవాసులకు కూడా ఆటపై మోజు పెరిగింది. దీంతో వారు కూడా ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు.

వర్షం నీళ్లు రాకుండా చూడాలి

వర్షాకాలంలో గ్రౌండ్ పూర్తిగా వర్షపునీటితో నిండి బురదమయంగా మారుతుంది. అలాగే మిలిటరీ క్వార్టర్స్ వద్ద గోడ అడ్డుగా కట్టడంతో వర్షపునీటితో గ్రౌండ్ నిండుతుంది. గ్రౌండ్ బురదమయం కావడంతో సగం గ్రౌండ్‌లో ఆడుకోవాల్సి వస్తుంది. రక్షణ శాఖ అధికారులు స్పందించి ఒక వంద మీటర్ల వరకు పైప్‌లైన్ వేస్తే సాఫీగా వెళ్లిపోతాయి.

\- మోహన్, జాతీయ క్రీడాకారుడు

గ్రౌండ్‌ను చదును చేయాలి

గ్రౌండ్ చదునుగా లేకపోవడంతో క్రీడాకారులు ప్రాక్టీస్ చేసే కింద పడిపోయి కాళ్ళు విరిగిపోయే ప్రమాదం ఉంది. మంచినీటి వసతి లేదు. వాష్ రూమ్‌లు అందుబాటులో లేకపోవడం క్రీడాకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఆ వసతి కల్పించాలి. - సూర్య కిరణ్, క్రీడాకారుడు



ఈ మైదానంలోనే శిక్షణ పొందాను

బాల్యం నుంచి ఈ మైదానంలో ఫుట్‌బాల్ క్రీడను ఆస్వాదిస్తూ వస్తున్నా. జాతీయస్థాయి క్రీడాకారుల వద్ద శిక్షణ తీసుకున్నా. అధికారులు స్పందించి మైదానంలోకి వర్షంనీరు, మురుగు రాకుండా చర్యలు చేపట్టాలి. పశువులు మైదానంలో పెరిగిన గడ్డిని మేయడానికి లోపలికి రాకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయాలి.

\- శివ రెడ్డి, క్రీడాకారుడు



వసతుల కల్పనకు కృషి

ఈ గ్రౌండ్ రక్షణ శాఖ ఆధీనం ఉంది. ఆ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. గ్రౌండ్ అభివృద్ధి, వాష్‌రూంలు, మంచినీటి వసతి ఏర్పాటు చేస్తాం. అన్నీ హంగులతో తీర్చిదిద్దడానికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళతాం.

\- భానుక నర్మద, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు



ఇరవై నాలుగు గంటల్లో దోపిడీ ముఠా అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీసీపీ, పోలీసు అధికారులు



నిందితులను అరెస్ట్ చేసి చూపుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్, బేగంపేట్ పోలీసులు

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు ప్రాంతాల్లో వ్యక్తుల్ని బెదిరించి దోపిడికి పాల్పడుతున్న నలుగురు నిందితులను ఇరవై నాలుగు గంటల్లోనే బేగంపేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మంగళవారం నార్త్‌జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ రష్మీ పెరుమాళ్, బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ, సైదయ్యలు నేర ఘటన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మారేడుపల్లి పికెట్ ప్రాంతానికి చెందిన కల్యాణ్ 3న అర్ధరాత్రి 12 గంటలకు క్యాంటిన్ పనులు పూర్తి చేసుకుని తన స్నేహితుడు తరుణ్‌తో కలిసి ఇంటికి వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు నడుచుకుంటూ చేరుకున్నారు. దారి మధ్యలో వీరు తమ స్నేహితుడు గోపికి ఫోన్ చేసి బైకు తీసుకుని రావాలని చెప్పగా అతడు స్టేషన్ వద్దకు వచ్చాడు. ముగ్గురు కలిసి క్లాక్‌టవర్ వైపు వాహనంపై వెళుతుండగా వాహనంలో పెట్రోల్ అయిపోయింది. ఆ సమయంలో అక్కడికి ఆటోలో వచ్చిన కార్ఖానాకు చెందిన పన్నం రాజేష్(18), సిఖ్‌విలేజీకి చెందిన బోయ నర్సింహ(18), పరుశురాం(20)తో పాటు మరో వ్యక్తి కలిసి కత్తులు చూపించి వారిని డబ్బులు డిమాండు చేశారు. అనంతరం వారినుంచి రూ.8,500 నగదును బలవంతంగా తీసుకుని పారిపోయారు. అదేవిధంగా ఈ నిందితులు బేగంపేట్ ప్రకాశ్‌నగర్‌కు చెందిన గుల్బం అన్సారీ బస్‌స్టాప్‌లో నిలబడి ఉండగా ఆటోలో వచ్చి కత్తితో బెదిరించి రూ.6000 వేలు నగదు, ఫోన్ నుంచి రూ.1,500 డబ్బులు వేయించుకుని పారిపోయారు. ఈ విషయాన్ని అన్సారీ తన యజమానికి ఫోన్ చేసి విషయం తెలుపడంతో వెంటనే మార్టిన్ బేగంపేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్రమత్తమైన బేగంపేట్ పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి ఆటో నంబరు ఆధారంగా నిందితులను ఇరవై నాలుగు గంటల్లోనే పట్టుకుని, దర్యాప్తు చేయగా నేరం ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇరవై నాలుగు గంటల్లో నిందితులను పట్టుకున్న బేగంపేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సైదులు డీఐ శ్రీనివాస్‌తో పాటు క్రైమ్ కానిస్టేబుళ్లు సతీష్, మహేష్, అజ్జు, అశోక్, హరీస్‌లను డీసీపీ అభినందించింది.

'దుందుభి'లో వసతి, మెస్ ప్రారంభం



మెస్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వీసీ, అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన దుందుభి వసతి గృహాన్ని ఆర్ట్స్, కామర్స్, సైన్స్ కోర్సుల్లో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు కేటాయించారు. దాదాపు 640 మంది విద్యార్థులకు వసతి సామర్థ్యంతో కలిగిన ఈ హాస్టల్‌లో మంగళవారం రూములు కేటాయించడంతో పాటు మెస్‌ను ప్రారంభించినట్లు చీఫ్ వార్డెన్ డా.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఓయూ వైస్ చాన్స్‌లర్ కుమార్ మొలుగరం, అధికారులు విద్యార్థులతో కలిసి మెస్‌లో మధ్యాహ్న భోజనం చేశారు. సీఎం ప్రారంభించిన రెండు హాస్టళ్ల ద్వారా 1200 మంది విద్యార్థులకు నూతన వసతి గృహాలు అందుబాటులోకి వచ్చాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొ.జి తేందర్‌కుమార్‌నాయక్, ప్రిన్సిపాల్స్ ప్రొ.కాశీం, ప్రొఫెసర్లు ప్రభాకర్, శేఖర్, ఇన్ఫ్రా డైరెక్టర్ ప్రొ.రాజశేఖర్‌రెడ్డి, లేడీస్ హాస్టల్ డైరెక్టర్ డా.కళ్యాణలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్య సంఘాలు చేపట్టిన సమ్మెకు జార్జిరెడ్డి పీడీఎస్‌యూ మద్దతు ప్రకటించింది. విద్యాసంస్థల ప్రతినిధులు యూనివర్సిటీలో మంగళవారం జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శులను కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వర్ రావు. సుమంత్ డిమాండ్ చేశారు.

శేఖర్‌కు ఓయూ డాక్టరేట్



శేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా యర్కారం గ్రామానికి చెందిన కొమ్ము శేఖర్ మాదిగ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రొఫెసర్ పార్థసారథి పర్యవేక్షణలో "కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ మున్సిపల్ కార్పొరేటర్స్ అండ్ కౌన్సిలర్స్ టువర్డ్స్ అర్బన్ గుడ్ గవర్నెన్స్: ఏ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై ఆయన విశ్లేషణాత్మక పరిశోధన చేశారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్)లో శేఖర్ ఓయూ అధ్యక్షుడిగా, పలు జిల్లాలకు ఇన్‌చార్జ్‌గా తన సేవలను అందిస్తూ ప్రస్తుతం రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న శేఖర్‌కు ఓయూ అధ్యాపక బృందం, విద్యార్థి సంఘాల నేతలు, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తనకు డాక్టరేట్ రావడానికి సహకరించిన ప్రొ.పార్థసారథితో పాటు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని అధ్యాపకులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో కెనరా బ్యాంకు మేనేజర్ అస్తా ఆహుజా

సకాలంలో పెన్షన్ చెల్లింపు

చిలకలగూడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షన్‌దారులకు సకాలంలో పెన్షన్ చెల్లించటానికి తగిన చర్యలు చేపడతామని సెంట్రల్ పెన్షన్ ప్రాసెసింగ్ సెంటర్(సీపీపీసీ) కెనరాబ్యాంక్ బెంగుళూరు శాఖ మేనేజర్ ఆస్తా ఆహూజ అన్నారు. చిలకలగూడలోని పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వే కార్యాలయాన్ని రైల్ నిలయం కెనరా బ్యాంకు మేనేజర్‌తో కలసి మంళవారం సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడుతూ నెలాఖరులో ఆది వారాలు, సెలవు రోజులను పరిగణనలోకి తీసుకొని నిర్ణీత సమయానికి పెన్షన్ చెల్లించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అక్టోబరుకు సంబంధించిన పెన్షన్‌ను 27 అక్టోబరున అందరి బ్యాంకు ఖాతాల్లో జమ అయిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన ట్రాఫిక్ పోలీసులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజ్

బోయినపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డెయిరీ ఫార్మ్ రోడ్డు నుంచి సుచిత్ర వైపున పిల్లర్ నంబర్ 32 సమీపంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. దీంతో ఆ రోడ్డు వైపు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రైవేట్ ఏజెన్సీల సహకారంతో రోడ్డు గుంతలను కాంక్రీట్ రెడీమిక్స్‌తో పూడ్చే పనులు చేపట్టారు. కంటోన్మెంట్, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించకపోవడంతో తాము గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఏసీపీ తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ప్రజల సౌకర్యార్థం చేపట్టిన కార్యక్రమంతో ఆ ప్రాంతంలో రాకపోకలు సజావుగా సాగుతున్నాయని పలువురు ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలి : జక్కుల

బోయినపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంవత్సరానికి పైగా కంటోన్మెంట్ ప్రాంతంలో వేల కోట్ల అభివృద్ధి పనులు ఎక్కడ జరిగాయో కాంగ్రెస్ ప్రభుత్వం చూపించాలని, 9 నెలలు కాదు 90 నెలలైనా అభివృద్ధి చేయదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ బీఆర్ఎస్ సభ్యులు పాండు యాదవ్, నళిని కిరణ్, అనిత, శ్యామ్ కుమార్, లోకనాథంలతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు ఓడిపోతామనే భయం పట్టుకుందని అన్నారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.4 వేల కోట్లు నిధులు తెచ్చామని చెప్పడం, అలాగే ఆస్యాస్పదమన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ సైతం కోట్ల నిధులు కంటోన్మెంట్‌కు తీసుకొచ్చామని అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. అయితే ఆ నిధులతో చేసిన అభివృద్ధిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ప్రశాంత్ కుమార్, రాజిరెడ్డి, సాయి కిరణ్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణికి 238 దరఖాస్తులు

బేగంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 238 దరఖాస్తులు వచ్చాయి. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటూ వారి సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు 51, రెవెన్యూకు 46, మున్సిపల్‌కు 23, ఇందిరమ్మ ఇండ్ల కోసం 67, ప్రవాసీ ప్రజావాణికి 2, ఇతర శాఖలకు చెందిన 49 దరఖాస్తులు వచ్చినట్లు అధికారి తెలిపారు.

డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

- తృటిలో తప్పిన ప్రమాదం
- వృద్ధ దంపతులకు గాయాలు



ప్రమాదానికి గురైన కారు

అడ్డగుట్ట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రికి వెళుతున్న వృద్ధ దంపతుల కారు ప్రమాదానికి గురైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ వైజయంతి కాలనీకి చెందిన మారుతి, జయలక్ష్మి వృద్ధ దంపతులు. మంగళవారం సికింద్రాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం కోసం ఇంటి నుంచి కారులో బయలుదేరారు. మారేడుపల్లి వద్ద కారు నడుపుతున్న భర్తకు ఒక్కసారిగా కళ్లు తిరుగడంతో ఏం చేయాలో తోచని పరిస్థితిలో బ్రేక్ వేయబోయి ఎక్సలేటర్ నొక్కడంతో కారు వేగంగా డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అటునుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో దంపతులు ప్రాణాలతో బయటపడ్డారు. భార్యకు స్వల్ప గాయాలపాలవ్వడంతో ఆమెను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌తో పాటు కానిస్టేబుళ్లు, తుకారాంగేట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును క్రేన్ సాయంతో తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుకోని పరిస్థితిలో ఈ ఘటన జరిగిందని కారు ప్రమాదంలో గాయపడ్డవారు తెలిపారు.

ప్రమాదాల నివారణకు విద్యుత్ స్తంభాలను మార్చాలి

ఎర్రగడ్డ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్లోని పలు ప్రాంతాలలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరుతూ మంగళవారం ఎర్రగడ్డ విద్యుత్ శాఖ ఏఈ తబ్రీజ్ కు జనసేన పార్టీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు రాజేష్ సాహూ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్లోని పలు ప్రాంతాలలో ఐరన్ పోల్స్ ఉండడం వల్ల వర్షం వచ్చినప్పుడల్లా ఆ స్తంభాల మూలంగా కరెంట్ షాక్ తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే విద్యుత్ స్తంభాలను మార్చడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అందుకు ఏఈ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీలు ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో జనసేన పార్టీ నాయకులు రామకృష్ణ, విజయ్ నాయక్, సునీల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆనందం.. ఆహ్లాదం

అటల్ బిహారీ వాజ్‌పేయి పార్కు



వాకింగ్ ట్రాక్‌పై సీనియర్ సిటిజన్స్



ఓపెన్ జిమ్



పార్కు లోపల ప్రహరీకి చిత్ర కళలు

మారేడుపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ పికెట్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి పార్క్ సందర్శకులతో కిటకిటలాడుతుంది. ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో దాదాపు కోటి రూపాయల వ్యయంతో సకల హంగులతో కంటోన్మెంట్ ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కంటోన్మెంట్ ప్రాంతంలో అటల్ బిహారీ వాజ్‌పేయ్ పార్క్ ఒక ప్రత్యేకతను చాటుతుంది. నగరంలో లుంబిని పార్క్ తరహాలో పికెట్ జూబ్లీ బస్‌స్టేషన్ పక్కనే ఏర్పాటు చేసి, ఇక్కడి ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

పార్కు ప్రత్యేకతలు

పికెట్ కంటోన్మెంట్ అటల్ బిహారీ వాజ్‌పేయ్ పార్కులో 11 ఫీట్లతో ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్‌పేయి కాంస్య విగ్రహం నగర ప్రజలను ఆకట్టుకుంటుంది. సీనియర్ సిటిజన్స్ వాకింగ్ చేసుకోవడానికి కిలోమీటరు పొడవు వాకింగ్ ట్రాక్, ఏర్పాటు చేశారు. చిన్నారులు పెద్దలు, మహిళలు వృద్ధులు అన్ని వయస్సుల వారు వ్యాయామం చేసుకునేందుకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. చూపరులను ఆకట్టుకునేందుకు రంగురంగుల పూల మొక్కలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు, చెట్లను పెంచారు. పార్కులో పూర్తి స్థాయి గ్రీనరీ ఏర్పాటు చేశారు. యోగా చేసుకునేందుకు విశాలమైన స్థలాన్ని కేటాయించారు. పార్కు లోపల చుట్టూ ప్రహరీకి చిత్ర కళాకారులు గీసిన రంగురంగుల చిత్రలేఖనం, మనస్సును దోచేవిధంగా పలు అంశాలతో కూడిన చిత్రకళలను రూపొందించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పచ్చదనం, గ్రీనరీతో సందర్శకులు మంత్రముగ్ధులవుతున్నారు. సేద తీరేందుకు ఊరట కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.